# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఉత్తరప్రదేశ్ లోని జెవార్‌లో సెమీ కండక్టర్ల తయారీ ప్లాంట్ ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- సుప్రీంకోర్ట్ 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇటీవల చేపట్టిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించారు.
- యూపీఎస్సీ నూతన ఛైర్మన్ గా డాక్టర్ అజయ్ కుమార్ నియమితులయ్యారు.
- “ఖేలో ఇండియా” యూత్ గేమ్స్ ఈరోజుతో ముగిశాయి.

==========================

ఉత్తరప్రదేశ్ లోని జెవార్‌లో సెమీ కండక్టర్ల తయారీ ప్లాంట్ ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఆమోదం తెలిపింది. న్యూ ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం అనంతరం సెమీ కండక్టర్ల పరిశ్రమను ప్రోత్సహించే క్రమంలో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ నూతన సెమీకండక్టర్ యూనిట్ నిర్మాణంతో దాదాపు 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని, నెలకు 3 కోట్ల 60 లక్షల చిప్‌లను ఈ ప్లాంట్ ఉత్పత్తి చేస్తుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడిస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

ఇప్పటికే భారత్ లో ఐదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయని... ఈ నూతన యూనిట్‌తో సెమీకండక్టర్ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి భారతదేశం తన ప్రయాణంలో మరింత ముందుకు సాగుతోందని మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. సెమీకండక్టర్ రంగానికి సంబంధించి దేశంలోని 270 విద్యాసంస్థల విద్యార్థులు, 70 అంకుర సంస్థలు నూతన ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి ప్రపంచ స్థాయి డిజైన్ సాంకేతికతలపై పనిచేస్తున్నారని కేంద్రమంత్రి తెలియజేశారు.

==========================

సుప్రీం కోర్ట్ 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఈరోజు ప్రమాణస్వీకారం చేశారు. నిన్నటితో జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో జస్టిస్ బి.ఆర్.గవాయ్ నియమితులయ్యారు. నవంబరు 23 వరకూ బి ఆర్ గవాయ్ సీజేఐగా సేవలందించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బి.ఆర్.గవాయ్ తో ప్రమాణస్వీకారం చేయించారు.

(వాయిస్ 26 సెకన్లు)

===========================

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని తెలంగాణ సరిహద్దులో ఉన్న కర్రెగుట్ట కొండలపై దాదాపు 21 రోజుల పాటు కొనసాగిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో 16 మంది మహిళా మావోయిస్టులు సహా 31 మంది మావోయిస్టులు మరణించారు. ఈరోజు బీజాపూర్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF), ఛత్తీస్‌గఢ్ పోలీస్ ఉన్నతాధికారులు ఆ వివరాలను వెల్లడించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF) డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 21 నుండి ఈ నెల 11 వరకు నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని చెప్పారు. సెల్ఫ్-లోడింగ్ రైఫిల్స్ (SLRలు), సెమీ ఆటోమేటిక్ ఆయుధాలు, 450 IEDలు సహా మొత్తం 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

===========================

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నూతన ఛైర్మన్ గా డాక్టర్ అజయ్ కుమార్ నియమితులయ్యారు. అజయ్ కుమార్‌ను ఛైర్మన్ గా నియమిస్తూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. UPSC ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రోజు నుండి ఆయన పదవీకాలం ప్రారంభమవుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డాక్టర్ అజయ్ కుమార్ 1985 బ్యాచ్ కేరళ కేడర్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆగస్టు 2019 నుండి అక్టోబర్ 2022 వరకు రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పని చేశారు.

విరామం

===========================

ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా అమలు చేయడంపై భారత త్రివిధ దళాల అధిపతులు తమ అంతర్ దృష్టులను పంచుకున్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి, ఎయిర్ ఫోర్స్ ఎయిర్ మార్షల్ ఎపి సింగ్ లు త్రివిధ దళాలు ఎలా సమన్వయంతో పని చేసి ఈ ఆపరేషన్‌ను దిగ్విజయంగా పూర్తి చేసాయో వివరించారు. వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో పాటూ.. ఆధునిక సాంకేతిక మల్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను ఖచ్చితత్వంతో సాధించామని పేర్కొన్నారు.

===========================

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దును దాటి ఏప్రిల్ 23న పాకిస్తాన్ రేంజర్స్ కు పట్టుబడిన సరిహద్దు భద్రతా దళం (BSF) జవాన్ పూర్ణం కుమార్ షా ఈ రోజు ఉదయం భారత్ కు సురక్షితంగా చేరుకున్నారు. BSF అధికార వర్గాలు ఈ విషయాన్ని ధృవీకరించాయి. అమృత్సర్‌లోని అట్టారి జాయింట్ చెక్ పోస్ట్ ద్వారా అతన్ని అప్పగించినట్లు వెల్లడించాయి. ప్రోటోకాల్ ప్రకారం ఈ ప్రక్రియ శాంతియుతంగా జరిగిందని పేర్కొన్నాయి. కాగా సరిహద్దు కంచె దగ్గర పని

చేస్తున్న రైతులను రక్షించే బృందంలో విధులు నిర్వహిస్తున్న పూర్ణం కుమార్ షా అనుకోకుండా అంతర్జాతీయ సరిహద్దును దాటడంతో పాకిస్తాన్ బలగాల అదుపులోకి వెళ్లవలసి వచ్చింది.

============================

“ఆపరేషన్ సింధూర్” విజయవంతమైన నేపథ్యంలో “శౌర్య తిరంగ యాత్ర”ను దేశ వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో నిర్వహిస్తున్నారు. ఈరోజు దేశంలోని వేరు వేరు ప్రాంతాలలో ఈ తిరంగ యాత్రను చేపట్టగా అందులో అనేక మంది పాల్గొంటున్నారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ నాయకులు కూడా తిరంగ యాత్రలో భాగమవుతున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు డియో దేశాయ్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగి ఆదిత్య నాత్ మాట్లాడుతూ…

(వాయిస్ 24 సెకన్లు)

============================

“ఖేలో ఇండియా” యూత్ గేమ్స్ ఈరోజు న్యూఢిల్లీ లోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన జిమ్నాస్టిక్స్ ఫైనల్స్ తో ముగిశాయి. షూటింగ్, సైక్లింగ్ జిమ్నాస్టిక్స్ ఈవెంట్‌లకు న్యూఢిల్లీ ఆతిథ్యం ఇవ్వగా.. మిగిలిన పోటీలు బీహార్‌లో జరిగాయి. ఇక జిమ్నాస్టిక్స్ ఈవెంట్స్ చివరి రోజున ఉత్తరప్రదేశ్‌కు చెందిన హర్షిత్ డి, తెలంగాణకు చెందిన నిషికా అగర్వాల్ అత్యుత్తమ ప్రదర్శనకారులుగా నిలిచారు. కాగా 11 రోజుల పాటూ జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2025 మే 4న ప్రారంభమయ్యాయి.

============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

============================

భారత నియంత్రణ రేఖ ఎల్వోసీ వెంబడి పంజాబ్ సరిహద్దుల వద్ద కొద్ది రోజుల క్రితం పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన వారి సంఖ్య 23కి చేరింది. మరో 13 మంది ఇప్పటికీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మజిత, ధ్రివాల్ ప్రాంతాల్లోని 7 గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించామని అమృత్‌సర్ సివిల్ సర్జన్ డాక్టర్ కిరణ్ దీప్ వెల్లడించారు.

============================
============================